గాంధీ పార్కును గాలికొదిలేశారు

- నిర్వహణ లోపంతో పాడైపోతున్న వస్తువులు
- పార్కులో తిరగని పిల్లలు ఆడుకునే ట్రైన్
- కొన్నింటికి తాళాలు వేసి వదిలేసిన వైనం

నెహ్రూనగర్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి అత్యంత సుందరంగా గాంధీ పార్కును తీర్చిదిద్దారు. అయితే ప్రస్తుతం నిర్వహణను పట్టించుకోకపోవడంతో పార్కులోని వస్తువులు పాడైపోయే పరిస్థితి చేరుకున్నాయి. కొన్ని ఆట వస్తువులు ఆడుకునేందుకు వీల్లేకుండా తాళాలు వేయడంతో చిన్నారులు నిరాశకు గురవుతున్నారు.

పక్కన పెట్టిన ట్రైన్

గాంధీ పార్కులో చిన్నారులు తిరిగేందుకు బ్యాటరీ ట్రైన్ ఏర్పాటు చేశారు. అయితే, దానిని తిప్పకపోవడంతో అలాగే పక్కనే పెట్టేశారు. స్ప్లాస్ ప్యాడ్, సాఫ్ట్ ప్లే గేమ్ జోన్‌కు తాళాలు వేసి ఉండటంతో అక్కడ పిల్లలు వెళ్లి ఆడుకోలేని పరిస్థితి. జంగిల్ పార్కులో బొమ్మలకు పెయింట్‌లు పోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి.

అధిక రేట్లుకు అమ్ముతున్న వ్యాపారులు

గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో వస్తువులు అధిక రేట్లుకు అమ్ముతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఊరి మధ్యలో ఉన్నప్పటికీ అన్ని వస్తువులపై రూ.5 నుంచి 10 రూపాయిలు దాకా అదనంగా వసూలు చేసుకుంటూ తమ జేబులు నింపుకుంటున్నప్పటికీ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం గమనర్హం. ఇప్పటికైన అధికారులు స్పందించి గాంధీ పార్కు నిర్వహణను సమగ్రంగా నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు


పట్టా కప్పి పక్కన పెట్టిన బ్యాటరీతో నడిచే ట్రైన్


తాళాలు వేసి ఉన్న స్ప్లాస్ ప్యాడ్


పెయింట్లు పోయి అంద విహీనంగా ఉన్న జంగిల్ పార్క్


పార్కులోని క్యాంటీన్

క్లుప్తంగా

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



లక్ష్మీపురం: అఖిల భారత యువజన మహాసభల 22వ వాల్ పోస్టర్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి సోమవారం శ్రీనివాసరావుపేట కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీత్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. లఘు కచేరీలలో పలువురు యువత ఉత్సాహంగా పాల్గొంది. గండూరి శ్రీనివాసమూర్తి శిష్య బృందం వయోలిన్ వాదన సంగీతాభిమానులను అలరించింది. సాయంత్రం డి.రాఘవాచారి శిష్యులు సుధీర్ శర్మ గాత్ర సంగీత కచేరి నిర్వహించారు. శాస్త్రీయ సంగీత కచేరీలో త్యాగరాజ కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వాయులీనంపై పెరవలి నందకుమార్, మృదంగంపై పి.జయభాస్కర్ సహకారాన్ని అందించారు. కళాకారులను ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ సత్కరించారు.

ఆకట్టుకున్న నాటికలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గత మూడు రోజులుగా కె.ఆర్.కె.ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి పుట్టగుంట ప్రభాకర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎల్.వి.ఆర్ క్రియేషన్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో బత్తినేని సుభాష్ రచించి, దర్శకత్వం వహించిన 'వీళ్ల నటన పాడుగాను' హాస్య నాటిక, సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో స్నిగ్ధ రచనకు, మంజునాథ్ దర్శకత్వం వహించిన 'జేబు చెప్పిన ఊసులు' నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో పరిషత్ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, బొప్పన నరసింహారావు(బుజ్జి), జి.మల్లికార్జునరావు, వేములపల్లి విఠల్ పాల్గొన్నారు. చివరగా కళాకారులను సత్కరించారు.

సిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలతో ఏఎన్‌యూ ఒప్పందం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులోని సిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. గంగాధరరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సిమ్స్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బి. శివ శిరీష, సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిస్టి కిరణ్ ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఎంఓయూ ఉద్దేశాలను వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్. పాల్ కుమార్ వెల్లడించారు. క్రీడల్లో క్రీడాకారులకు గాయాలు అయినప్పుడు వాటిని నివారించడం, పునరావాసం కల్పించడం, ఫిజియోథెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ క్రీడా టోర్నమెంటులకు సిమ్స్ కళాశాల ఫిజియోథెరపీ ప్రత్యక్ష సేవలు అందజేస్తుందని వెల్లడించారు. ఐదు సంవత్సరాల పాటు ఎంఓయూ కొనసాగుతుందని చెప్పారు. వీసీ ఆచార్య కె.గంగాధర రావు మాట్లాడుతూ ఎంఓయూ ద్వారా క్రీడా వ్యవస్థను పటిష్టం చేసే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

మహిళా క్రికెట్ జట్టుకు వీసీ అభినందనలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తొలి మహిళా క్రికెట్ జట్టుకు సోమవారం యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. గంగాధరరావు అభినందనలు తెలిపారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారిణిలకు శుభాకాంక్షలు చెప్పారు. సోమవారం మహిళా క్రికెట్ జట్టు మైసూర్‌లో జరిగే సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వెళ్లింది.

వర్సిటీని సందర్శించిన శాప్ చైర్మన్ రవి నాయుడు

ఆంధ్రప్రదేశ్ క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్ ఏ.రవినాయుడు సోమవారం యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీలో నేషనల్ అథ్లెటిక్స్ కోసం శిక్షణ పొందుతున్న క్రీడాకారులను అభినందించారు.

ట్రెక్కింగ్‌తో సరికొత్త అనుభూతి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న మహిళా కేడెట్లు నూతన అనుభూతిని పొందుతున్నారు. కొండవీడు కొండను అన్ని వైపుల నుంచి నిలువునా ఎక్కిన కేడెట్లు, ట్రెక్కింగ్‌లో సరికొత్త నైపుణ్యాలను అలవర్చుకుంటున్నారు. ఏపీ ట్రెక్-3 శిబిరంలో భాగంగా 331 మంది మహిళా కేడెట్లు సోమవారం కొండవీడు కోటలో ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్టప్ ఐడియాలపై విస్తృత పరిజ్ఞానాన్ని అందించేందుకు స్టార్టప్ వర్క్‌షాప్ నిర్వహించారు. నవధిత బిజినెస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు ప్రధాన్ ఆచార్య, పీకే-4 సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సీఈవో కిశోర్ నరసింహం, పారిశ్రామికవేత్త జ్యోతి, వైశాలి హుక్కారితో పాటు ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. తాజాగా సోమవారం 14వ శతాబ్దానికి చెందిన ఎలిఫెంట్ రూట్ ద్వారా కొండవీడులో ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు.


కొండవీడుకోటకు ట్రెక్కింగ్‌కు వెళ్లిన కేడెట్లతో గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్, అధికారులు

పీడీఎఫ్ అభ్యర్థులకు సీఐటీయూ మద్దతు

రాష్ట్ర కమిటీ పిలుపు

లక్ష్మీపురం: రానున్న శాసనమండలి ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం సీఐటీయూ అనుబంధ, ఉద్యోగ సంఘాలు సంపూర్ణ మద్దతుతో పాటు వారి గెలుపునకు కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. సీఐటీయూ అఖిలభారత పూర్వ అధ్యక్షులు ఈ బాలానందన్ శత జయంతి సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని కొరటాల మీటింగ్ హాలులో సోమవారం జరిగిన సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కె. యస్. లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. శాసనమండలిలో ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పాత్రను పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగ, కార్మిక గొంతును శాసనమండలిలో వినిపించేందుకు పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం సీఐటీయూ అన్ని అనుబంధ సంఘాలు, ఉద్యోగ సంఘాల కృషి చేయాలని కోరారు. సదస్సులో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు కె. బేబీ రాణి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీలు


పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్


పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు దక్షిణ డీఎస్పీ భానోదయ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సోమవారం గుంటూరు పశ్చిమ డీఎస్పీ కె. అరవింద్, గుంటూరు దక్షిణ డీఎస్పీ జి.భానోదయ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. మానవతా దృక్పథంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా కృషి చేయాలని నూతన డీఎస్పీలకు సూచించారు.

- గుంటూరు పశ్చిమ డీఎస్పీ కె.అరవింద్, గుంటూరు దక్షిణ డీఎస్పీ జి.భానోదయ 2022 డీఎస్పీ బ్యాచ్‌కు చెందిన వారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు బదిలీయ్యారు. గుంటూరు పశ్చిమ డీఎస్పీ కె.అరవింద్ బీటెక్ చదివారు. గ్రేహౌండ్స్‌లో ప్రొబేషనరీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ గుంటూరు పశ్చిమ డీఎస్పీగా నియమితులయ్యారు. సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.
- గుంటూరు దక్షిణ డీఎస్పీ జి.భానోదయ ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు. రాజమండ్రి తూర్పు జోన్ ప్రొబేషనరీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. సోమవారం ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ 2024–25కు బీ.ఫార్మసీ విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని ప్రముఖ ఔషధ సంస్థల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరికి నెలకు రూ.ఐదు వేల ఉపకార వేతనాన్ని అందించడంతో పాటు ఉపాధి కల్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి తమ కళాశాలలో 40 మంది బీ.ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులు నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. సీతారామయ్య, ఇన్‌చార్జ్ సీహెచ్. ప్రసాదరావు పాల్గొన్నారు.


పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రామకృష్ణారెడ్డితో ప్రిన్సిపాల్ నాగభూషణం

బ్రాడీపేటలో భారీ పేలుడుతో మంటలు


పగిలి పోయిన ఇంటి పైకప్పు రేకులు



వివరాలను సేకరిస్తున్న పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు

- ఇంటి యజమానులు ఇద్దరికి తీవ్ర గాయాలు
- వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

లక్ష్మీపురం: ఓ ఇంట్లో భారీ పేలుడుతో పైకప్పు రేకులు పగిలి పోవడంతో మంటలు చెలరేగిన ఘటన బ్రాడీపేటలో సోమవారం జరిగింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట 6/18వ అడ్డరోడ్డులోని సయ్యద్ ఘన్ సైదా కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య మస్తాన్‌బీ, కుమారుడు షరీఫ్ ఉన్నారు. సోమవారం తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా భారీ పేలుడు శబ్దం రావడంతో ఒక్కసారిగా చుట్టు పక్కల వారందరూ లేచారు. చూసే సరికి మంటలు చెలరేగుతున్నాయి. ఇంటి కప్పు రేకులు సైతం పగిలి పోయి ఉన్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాప సిబ్బందికి సమాచారం తెలియజేసి, మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలకు ఇంట్లో ఉన్న సయ్యద్ ఘన్ సైదా, భార్య మస్తాన్‌బీల కాళ్లు కాలడంతో స్థానికుల సహాయంతో ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. మంటలకు ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలి పోయాయి. విషయం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన వైనాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ పలు కీలక ఆధారాలను సేకరించింది. పేలుడుకు గ్యాస్ లీకేజ్ కారణమా లేక ఇతర కారణాల అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

పట్నంబజారు : లారీ ఢీకొనడంతో 11 విద్యుత్ స్తంభాలు పడిపోయిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కమలా కాయల లోడుతో సోమవారం ఉదయం గుంటూరు నగరంలోని లాలాపేట ప్రాంతానికి లారీ వచ్చింది. లాలాపేట పోలీసు స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద వెనక్కు టర్నింగ్ తీసుకున్న సమయంలో డ్రైవర్ గమనించకపోవడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో 11 స్తంభాలు నేలకు ఒరగడంతో ఆ ప్రాంతమంతా అంధకారం ఏర్పడింది. విద్యుత్ అధికారుల ఫిర్యాదులో రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరించే క్రమంలో అధికారులు ఉన్నారు. జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు ఎక్కడిక్కడ తెగిపోయి పడడంతో సరఫరాను నిలిపి వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అర్జీలను బాధ్యతతో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను బాధ్యతగా అధికారులు సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 15 ఫిర్యాదులు తీసుకొన్నారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని తెలిపారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సిటీప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, మేనేజర్ బాలాజీ బాషా, ఆర్ఓలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విస్తరణ పూర్తయిన ప్రాంతంలో నిర్మాణ పనులను తక్షణం ప్రారంభించాలని తెలిపారు. సోమవారం ఆయన ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులతో పాటు పట్టాభిపురం మస్టర్ పాయింట్, దుర్గానగర్ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల జాప్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే పలు ఫిర్యాదులు అందినా పనులు వేగంవతం చేయకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పట్టాభిపురం ప్రజారోగ్య విభాగ మస్టర్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. కార్మికులు, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ఇన్‌స్పెక్టర్ల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నగరంలో ప్రధాన రహదారులపై ఆవులు ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని పట్టుకుని జీఎంసీ గోశాలకు తరలించాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. అనంతరం దుర్గానగర్‌లో బిహార్, శ్రీకాకుళం నుంచి కార్మికులను తీసుకొచ్చి, వారికి కనీస మౌలిక వసతులు కల్పించకుండా రేకుల షెడ్లలో అధిక సంఖ్యలో ఉంచడాన్ని గమనించారు. తక్షణం ఆయా షెడ్‌ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనుమతి తీసుకోకుండా నిర్మించిన షెడ్లను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ మధుసూదనరావు, ఆర్ఓ రెహ్మాన్, కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గుంటూరు నగరంలోని డొంక రోడ్ మూడు వంతెనల వద్ద రైల్వే శాఖ చేపట్టిన నూతన ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు ఫిబ్రవరి 10వ తేదీకల్లా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రైల్వే అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో రైల్వే, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, పట్టణ ప్రణాళిక అధికారులతో పనుల పురోగతి, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో జీఎంసీ తాగునీటి పైప్ లైన్ షిఫ్ట్, డ్రెయిన్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఈఈని ఆదేశించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రధాన సెంటర్లలో సిబ్బందిని నియమించాలని సీఐకి సూచించారు. సమావేశంలో రైల్వే ఏడీఎన్ జగన్మోహనరావు, ఎస్ఎస్ఈ వెంకటేశ్వరరావు, జీఎంసీ ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఏసీపీ రెహ్మాన్, ట్రాఫిక్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 160 మంది విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో సోమవారం సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 160 మంది విద్యార్థులు ఉద్యోగాలను ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో జేకేసీ కళాశాల నుంచి 114 మంది, సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి 43 మంది ఉన్నారని వివరించారు. వీరికి రూ.2.5 లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు వార్షిక వేతనాన్ని ఇవ్వనున్నట్లు సదర్లాండ్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, ప్లేస్‌మెంట్స్ అధికారి వై.సురేష్‌బాబు అభినందించారు.

ట్రైనీ డాక్టర్ అత్యాచారం కేసుపై 27న విజయవాడలో సదస్సు

లక్ష్మీపురం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన దేశంలో ఉద్యమ పరిణామానికి దారితీయబోతోందని కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో విజయవాడలో ఈనెల 27న సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: గొడవల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు సోమవారం రాత్రి పాల్పడ్డాడు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపురం 2వ లైన్‌కు చెందిన ఏనుగుల ఆనంద్ బాబు, భార్య విజయలక్ష్మి మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. దీంతో గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఆనంద్ బాబు మద్యం తాగుతూ బాధపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నం చేశాడు. గమనించిన తమ్ముడు హుటాహుటిన తలుపు బద్దలు ఆనంద్‌బాబును ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి దారిలోనే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పాత గుంటూరు పోలీసు స్టేషన్, మంగళదాస్‌నగర్‌లలో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. పాత గుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య నేతృత్వంలో వారధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ చుట్టుపక్కల జరిగే ప్రతి నేరంపై పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య మాట్లాడుతూ మద్యం తాగి ఘర్షణలు చేయడం, వాదులాడుకుంటూ చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నారులు, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు చక్కటి బాటలు వేయాలని, వారు ఉన్నత స్థితికి చేరుకునేలా చూసుకోవాలని సూచించారు. రౌడీలు, అసాంఘిక శక్తులు, ఏదైనా ఇబ్బందులకు గురిచేస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రెహమాన్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.